రెవెన్యూ భూముల్లో అక్రమ తవ్వకాలు

- అనుమతి కొంచెం... తీసేది చాలా
- మట్టి తవ్విన ప్రాంతాన్ని సాగు చేస్తున్న రైతులు
- పట్టించుకోని రెవెన్యూ, అటవీశాఖ అధికారులు
- గ్రామాల్లో మాయమవుతున్న గుట్టలు

జగిత్యాలరూరల్: అధికారుల అలసత్వంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గుట్టలు తవ్వేస్తూ అక్రమంగా మట్టిని తరలిస్తూ కాసులు గడిస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఇంత తతంగం జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. రెవెన్యూ భూముల్లో ఉన్న గుట్టలను ఎలాంటి అనుమతి లేకుండా జేసీబీ, ప్రొక్లెయిన్‌తో తవ్వకాలు చేపట్టి మట్టిని తరలించుకుంటూ కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పాటు మట్టి తీసిన ప్రాంతాన్ని సమీప ప్రాంతాల్లోని రైతులు ఇదే అదునుగా భావించి చదును చేసుకుని భూములు సాగు చేస్తున్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, జాబితాపూర్, హబ్సీపూర్, మోరపల్లి, తాటిపల్లి, చల్‌గల్, నర్సింగాపూర్, అంతర్గాం గ్రామ శివారులోని రెవెన్యూ భూమిలో ఉన్న గుట్టలను రాత్రి వేళల్లో ప్రొక్లెయిన్లు, జేసీబీలతో మట్టి తవ్వుతూ ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు.నెల రోజులుగా ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉండగా రెవెన్యూ, అటవీశాఖ భూముల్లో తవ్వకాలు యథేచ్ఛగా చేపట్టారు.


కల్లెడలో రెవెన్యూ భూమిలో చేపట్టిన తవ్వకాలు

మాయమవుతున్న గుట్టలు

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అటవీ భూములు, రెవెన్యూ భూములోల ఉనన గుట్టల నుంచి ఇటీవల కాలంలో రోడ్ల నిర్మాణానికి, కాలుల నిర్మాణనికి చెరువుల మరమ్మతులకు కొంత మేర అనుమతి తీసుకుని పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

రెవెన్యూ భూములు సాగుకు..

జిల్లాలో గ్రామాల్లో రెవెన్యూ భూముల్లో ఉన్న గుట్టలను కాంట్రాక్టర్లు మట్టి తవ్వి తీసుకెళ్తుండగా ఇదే అదునుగా భావించిన కొందరు సమీప ప్రాంతాల రైతులు ట్రాక్టర్ల సహాయంతో చదును చేసి పెద్ద ఎత్తున రెవెన్యూ భూమిని కబ్జా చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో పాటు పొలాలకు వెళ్లే రైతులు ట్రాక్టర్లు, టిప్పర్లు రాకపోకలు పెద్ద ఎత్తున కొనసాగడంతో రోడ్లు గుంతలు పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆక్రమణల జోరు..

జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న ప్రభుత్వ, రెవెన్యూ, అటవీశాఖ భూములను సమీప ప్రాంతాలకు చెందిన రైతులు గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తొలగిస్తూ చదును చేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో కొన్ని చోట్ల రెవెన్యూ అధికారులు హద్దులు పెట్టి ప్రభుత్వ భూమిని ఆక్రమించకుండా చర్యలు చేపడుతున్నా కొన్ని చోట్ల యథేచ్ఛగా భూములను చదును చేసుకుని ఆక్రమించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


జాబితాపూర్ గ్రామ శివారులో తవ్వకాలు

ప్రభుత్వ భూముల్లో మట్టితీస్తే చర్యలు

గ్రామాల్లో ప్రభుత్వ, రెవెన్యూ భూముల్లో ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గత కొన్ని రోజులుగా ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంతో గ్రామాల్లో పర్యటించలేకపోయాం. రెండు రోజుల్లో ఆయా గ్రామాల్లో రెవెన్యూ భూములను పరిశీలించి ప్రభుత్వ భూమిలో ఎవరైనా తవ్వకాలు చేపట్టినా, చదును చేసినా చర్యలు చేపడతాం.

– రాంమోహన్, రూరల్ తహసీల్దార్

క్లుప్తంగా

సూపర్ మార్కెట్‌కు జరిమానా


జరిమానా విధిస్తున్న మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్

కోరుట్లటౌన్: పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో గడువు ముగిసిన తినుబండారాలు అమ్ముతున్నందుకు రూ.5 వేలు జరిమానా విధించినట్లు మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సూపర్ మార్కెట్లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఓ సూపర్ మార్కెట్‌లో గడువు ముగిసిన తినుబండారాలు విక్రయించేందుకు షాపులో నిల్వ ఉన్నవాటిని గుర్తించి, జరిమానా విధించారు. ప్రజలకు నాణ్యమైన తినుబండారాలు అందుబాటులో ఉంచాలని, గడువు తీరిన వాటిని తీసి వేయాలని నిర్వాహకులకు అవగాహన కల్పించారు. తనిఖీల్లో మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ అంజయ్య, జగ్గాల రమేష్, రాజు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు రక్త పరీక్షలు


రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వ హెల్త్ కార్డులు ఉన్న భవన నిర్మాణ కార్మికులకు సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో సోమవారం రక్త పరీక్షలు నిర్వహించారు. 76 మంది కార్మికుల రక్త నమూనాలు సేకరించి 50 రకాల రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, సీఎస్‌సీ ప్రతినిధులు సుధీర్, రవి కుమార్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సాహితీ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న టీచర్

జగిత్యాలరూరల్: మండలంలోని లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న మద్దెల సరోజన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కణిక సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. సరోజన ఉత్తమ రచనలకు గాను కణిక సాహిత్య సామాజిక వేదిక వారు ఈ అవార్డు ప్రకటించారు. అవార్డు అందుకున్న సరోజనను సోమవారం పాఠశాలలో ఎంఈవో గాయత్రి, సర్పంచ్ జాన్, కళాశ్రీ అధినేత గుండేటి రాజు, ఉపాధ్యాయులు సన్మానించారు.

తాటి చెట్లు నరికివేతపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు


ఫిర్యాదు చేసిన గీత కార్మికులు

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ శివారులో ఉన్న సుమారు 30 తాటి చెట్లను ఇద్దరు వ్యక్తులు నరికివేసి తమ ఉపాధిని దెబ్బతీశారని గీత కార్మికులు మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. యూసుఫ్‌నగర్‌కు చెందిన ఆర్మూర్ లక్ష్మణ్, చింతలపేటకు చెందిన మాదం తిరుపతి అనే వ్యక్తులు తాటి చెట్లను జేసీబీతో కూల్చి నరికివేశారని పేర్కొన్నారు. గీత వృత్తిపైనే ఆదారపడ్డ 300 కుటుంబాలు ఉపాధి కోల్పోయారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను కోరారు. కార్యక్రమంలో గీత కార్మికులు కోటగిరి రమేశ్, గుగ్గిళ్ల శేఖర్, బొంగు లింగం, బోండ్ల వెంకట స్వామి, పల్లి రాజు, బొంగు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపు వేలం

మల్లాపూర్: రెవెన్యూ అధికారులు ఇటీవల స్వాధీనం చేసుకున్న ఇసుక డంపును మండల కేంద్రంలో సోమవారం వేలం నిర్వహించారు. సుమారు 13 ట్రిప్పుల ఇసుకను వేలం వేయగా, గ్రామానికి చెందిన షేక్ ఖాసీం రూ.20,400లకు వేలం పాడి ఇసుక డంప్‌ను పొందాడని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వీర్‌సింగ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

జగిత్యాల: ఆటోకార్మికులను ఆదుకోవాలని ఎమ్మెల్యేకు జిల్లా ఆటో సంక్షేమ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 35 వేల మంది ఆటో కార్మికులు ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నారని, ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ద్వారా రూ.15 వేల వరకు జీవనభృతి కల్పించాలని సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు శెట్టి శ్రీనివాస్, ప్రశాంత్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

పరామర్శ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన అయిల్నేని సత్యనారాయణరావు, రాధమ్మ ఇటీవల మరణించగా, బాధిత కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. అలాగే మోతె గ్రామానికి చెందిన లక్ష్మీబాయి మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావిస్తా

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పీఆర్టీయూ నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా కొత్త పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు కోసం అసెంబ్లీలో పోరాడుతానన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినిపల్లి ఆనందరావు, రాజు, దుబ్బయ్య, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, జమున, సత్యనారాయణరావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన పీఆర్టీయూ నాయకులు

వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ



కథలాపూర్: మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లాల కిషన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా చెన్నమనేని రాజేందర్‌రావు, ప్రధానకార్యదర్శిగా వంగరి రాజారాం, కోశాధికారిగా కల్లెడ ప్రసాద్ ఎన్నికయ్యారు.కార్యక్రమంలో సర్పంచ్ కంటె నీరజ, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

మెట్‌పల్లి: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో తమ ఉపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన డ్రైవర్లు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఉచిత ప్రయాణంతో ఉపాధి దెబ్బతిని తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యే అవకాశముంటుందని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివలాల్, రంగు సంపత్, గణేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

కథలాపూర్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో జనార్దన్ అన్నారు. సోమవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలను సేకరించి వార్డుల వారీగా విభజన చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక తయారు చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చిన నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీవో తౌఖీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

అంధుల ఆశ్రమానికి విరాళం

మెట్‌పల్లి: హైదరాబాద్‌లో ఇట్రాడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంధుల అనాథ ఆశ్రమానికి పట్టణంలోని నిఖిల్ భరత్ పాఠశాల తరపున రూ.82 వేల విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆశ్రమ నిర్వాహకులకు కరస్పాండెంట్ వీబీ మహర్షి చెక్కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మానవత్వం పెంపొందించాలనే విరాళాల సేకరణకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు ఒక రోజు వేతనాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఆశ్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహకారమించాలని కోరారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 10 వ తరగతికి చెందిన 53 మంది విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి రావుట్ల హన్విక పరీక్ష ప్యాడ్లు, జామెట్రిక్ బాక్స్‌లు, పెన్నులు అందచేశారు. ఈ సందర్భగా హన్వికను, ఆమె కుటుంబ సభ్యులను హెచ్‌ఎం మధు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో యూత్‌సభ్యులు రాజు, విష్ణు, మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాలు పేరుతో మిల్లర్ల దోపిడీ

మేడిపల్లి: ప్రభుత్వాలు మారుతున్నా.. రైతుల తలరాతలు మారడం లేదు. మేడిపల్లి, భీమారం మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాలు తప్పా పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని వాపోతున్నారు. బస్తాకు 3 నుంచి 4 కిలోల ధాన్యం కోత విధిస్తున్నారని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా.. చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోయారు. అధికారులు రైతులకు కాకుండా మిల్లర్లకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయం దృష్టి సారించాలని, రైతులు కోరారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం




కోరుట్ల: పట్టణంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బ్యాచ్‌లో శ్రీసాయి జట్టు జీపీఎల్ జట్టు తలపడగా జీపీఎల్ జట్టు విజేతగా నిలిచింది. నెల రోజుల పాటు నిర్వహించే టోర్నమెంట్‌లో వివిద జట్లు తలపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కేరళ హైస్కూల్ కరస్పాండెంట్ ఎంఏ భారీ, ఆర్గనైజర్స్ కోట ప్రవీణ్, రవికిరణ్, సూర్య, సీనియర్ క్రీడాకారుడు బాలరాజ్, అబ్దుల్ మెహిద్, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ ఎంపీడీవోగా రాజశ్రీనివాస్



మల్లాపూర్: మండల ఎంపీడీవోగా చింత రాజశ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇన్‌చార్జీ ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు నిర్వహించిన ఎంపీవో జగదీశ్ నుంచి రాజశ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశ్రీనివాస్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపి, సన్మానించారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజయ్య


రాజయ్య

జగిత్యాల: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న రాజయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజావాణిలో కానరాని అధికారులు


అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు


కొండగట్టు: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికారులు రాలేదు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రజావాణి ఏర్పాటు చేస్తే దరఖాస్తులు ఇచ్చేందుకు, వచ్చిన అర్జీదారులు, అధికారులు రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను సంప్రదించగా, అధికారులు వివిధ శాఖల అధికారులు హాజరు కాలేదన్నారు.

సమాచారం..

రేపు పెగడపల్లి మండల సాధారణ సమావేశం

పెగడపల్లి: మండల పరిషత్ సాధారణ సమావేశం ఎంపీపీ శోభ అధ్యక్షతన ఈ నెల 13 ఉదయం 11:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు పెగ్గెర్లలో అయ్యప్పస్వామి జాతర



కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో బుధవారం అయ్యప్పస్వామి జాతర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, గురుస్వామి పూంద్ర భూమారెడ్డి తెలిపారు. జాతర ఉత్సవాల అనంతరం భక్తులకు అన్నదానం సౌకర్యం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

16న మండల సర్వసభ్య సమావేశం

కోరుట్ల రూరల్: కోరుట్ల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తోట నారాయణ అధ్యక్షతన ఈ నెల 16వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

చిత్ర కథ: ఈ దారిపై ప్రయాణమెలా?



మల్యాల: మండల కేంద్రంలోని సూరప్ప చెరువు కట్టపై దారిని ముళ్ల కంప చెట్ల కొమ్మలు కప్పేస్తుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువు కట్టపై నుంచి వెళ్లేందుకు దారికి ఇరువైపులా ఉన్న కంప చెట్ల కొమ్మలతో ఇబ్బంది పడుతున్నామని, చెట్ల కొమ్మలను తొలగించాలని గీత కార్మికులు కోరుతున్నారు.

24 గంటల్లో రంగు మారింది..

కొండగట్టు: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం ఆదివారం మొదటిసారి విజయోత్సవ ర్యాలీలో భాగంగా నాచుపెల్లి,కొడిమ్యాల గ్రామాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా కొడిమ్యాల ఎంపీడీవో కార్యాలయానికి గులాబీ రంగు ఉండగా, మూడు రోజుల్లోనే గులాబీరంగు తొలగిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 24 గంటలు కాక ముందే పాత రంగును తొలగించే పనులు మొదలుపెట్టారు. దీంతో మండల వ్యాప్తంగా ఈ విషయం హట్‌టాఫిక్‌గా మారింది. గతంలో ఈ కార్యాలయానికి గులాబీ రంగు వేయడాన్ని ప్రశ్నించగా, ఇప్పుడు ఎమ్మెల్యే హోదాలో రంగు తొలగించాలని ఆదేశాలివ్వడంతో అధికారులు తొలగించారు.


ఎంపీడీవో కార్యాలయానికి రంగు వేస్తున్న సిబ్బంది

జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు విద్యార్థులు


పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రావు సోమవారం తెలిపారు. వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో అండర్ –10 బాలుర విభాగంలో రిత్విక్ గోల్డ్‌మెడల్, సిల్వర్‌మెడల్, అండర్ –15 విభాగంలో పాయింట్ ఫైట్ లైట్ కటాఫ్‌లో మనోజ్, కృష్ణ గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్ సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. బాలికల విభాగంలో వర్షిని కాంస్యం, సహస్ర సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.